క్లుప్తంగా

రాష్ట్ర పద్మశాలీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజు


వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నాగరాజు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్న వానపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు బుధవారం నియామక పత్రాలను అందచేశారు. నాగరాజు గతంలో ఏపీ పద్మశాలీ సాధికారిత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర యువత అధ్యక్షునిగా పనిచేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేస్తానని తెలియజేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నాగరాజును పలువురు సంఘ నాయకులు అభినందించారు.

గురుకుల పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి


గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ భారతిని అభినందిస్తున్న మేతర అజయ్‌బాబు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా మానటరింగ్ సభ్యులు మేతర అజయ్‌బాబు కోరారు. జిల్లా గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన భారతిని స్థానిక అమీనాపేటలోని కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకెను అందచేశారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలని ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శశిధర్ తెలిపారు. బుధవారం స్థానిక బాలయోగి సైన్స్ పార్క్‌లోని ఏలూరు టౌన్, రూరల్ సబ్ డివిజన్ కార్యాలయం, పెదవేగి సబ్ డివిజన్, భీమడోలు సబ్ డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ మరమ్మతులు చేసే సమయంలో సిబ్బంది హెల్మెట్, సేఫ్టీ బెల్టులు తప్పనిసరిగా వినియోగించాలని, స్తంభాలపై ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. వర్షాకాలంలో గాలివానలకు ఎప్పుడైనా వైర్లు తెగిపోయినా, విద్యుత్ పరికరాల దగ్గర ఏదైనా ప్రమాదం జరిగినా వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఏడీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

భానుడి ఉగ్రరూపం

- పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడిపోతున్న నగర ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు

ఏలూరు టౌన్: ఎండలు మండుతున్నాయి. జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా, ఏలూరు నగరంలోనూ రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూ నిప్పుల వర్షాన్ని కురిపిస్తున్నట్టుగా ఉంది. ఇంట్లోంచి బయటకు రావడానికి ప్రజలు హడలెత్తిపోతున్నారు. రోహిణీ కార్తె ప్రారంభం నుంచీ భానుడి భగభగలకు ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతకు భూమిలోంచి సెగలు రావడంతో వడగాల్పులు విపరీతంగా వీస్తున్నాయి. రాత్రివేళ కూడా వేడిగాలులతో ఉక్కబోతను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత కూడా వేడి గాలులు, వడగాడ్పులతో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బుధవారం గరిష్ఠంగా ఏలూరు నగరంలో సుమారుగా 40డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రత నమోదైంది. జూన్ రెండో వారం ప్రవేశించినప్పటికీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు వరుణదేవుడి కటాక్షం కోసం వేచిచూస్తున్నారు.

అప్రకటిత కర్ఫ్యూ :

పది రోజులుగా భానుడి భగభగలతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఉదయం 11 గంటల సమయానికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్న సమయంలో అప్రకటిత కర్ఫ్యూను తలపిస్తున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, కూడళ్ళు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల దాటే వరకు జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఎండ వేడిమితో అల్లాడుతున్న జనానికి, వేడి గాలులు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఎండ, వేడిగాలుల ప్రభావం మంటలను తలపిస్తుండటంతో బయటకు రాలేకపోతున్నారు. ఇళ్లల్లోని వాటర్ ట్యాంకుల్లో నీరు వేడెక్కిపోతోంది.


ఎండవేడిమికి జాగ్రత్తలు పాటిస్తోన్న నగర ప్రజలు

గృహోపకరణాలు సైతం ముట్టుకుంటే మంటెక్కిపోతున్నాయి. వేసవి ప్రారంభంలో ఎండల తీవ్ర అంతగా లేక అంతంతమాత్రంగా సాగిన ఏసీలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు గత వారం రోజుల నుంచి గణనీయంగా పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.


భానుడి భగభగలతో జనం లేక వెలవెలబోతున్న రోడ్లు

జీవనోపాధిపై ప్రభావం

ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానీయాలు, సీజనల్ ఫ్రూట్స్ వినియోగం పెరుగుతోంది. ఇప్పటికే ఎక్కడికక్కడే జ్యూస్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. పలు రోడ్లలో బొప్పాయి, పుచ్చకాయలు, పండ్లు అమ్మకాలతో పాటు చెరకు రసం ఇతరత్రా జ్యూస్ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చుతుండటంతో చిరువ్యాపారుల జీవనోపాధిపై పెను ప్రభావం చూపుతున్నాయి. తినుబండారాలు, రోడ్డుపక్కనే ఇతరత్రా వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు ఎండలో తిరగకపోవడంతో వారి జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతోంది. వ్యవసాయ కూలీలు పొలం వెళ్లి పనులు చేసుకునేందుకు భయపడుతున్నారు. అనునిత్యం రద్దీగా ఉండే పలు కూడళ్లు నిర్మానుష్యంగా ఉండటంతో వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. కార్మికులు తమ విధులకు హాజరయ్యేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడగాల్పుల ప్రభావం నుంచి కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కార్మికులపై ప్రభావం



వేసవి కాలంలో తీవ్రమైన ఎండవేడిమికి జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక కార్మికుల జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. పనికి వెళితే గానీ కుటుంబ జీవనం సాగని పరిస్థితిలో తీవ్రమైన ఎండవేడిమిలో పనిచేయలేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై తోపుడు బండ్ల చిరు వ్యాపారులు గిరాకీ లేక డీలా పడుతున్నారు. రోహిణీ కార్తి నుంచీ తీవ్రమైన వేడిగాలులు, వడగాడ్పులు ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోనూ మజ్జిగ, చల్లటి నీటితో చలివేంద్రాలు ఏర్పాటు చేయటంతో కొంత ఉపశమనం లభిస్తోంది. – మేతర సురేష్, ఏఎంసీ డైరెక్టర్, ఏలూరు

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఏలూరు నగర ప్రజలు తీవ్రమైన వేడిమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఎండ వేడిమిలో బయటకు వెళ్లే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. మొఖానికి మాస్కు కట్టుకోవటం, కూలింగ్ గ్లాసెస్, తలపై క్యాప్ పెట్టుకోవటం మంచిది. ఇక తరచు చల్లటి నీరు, మజ్జిగ, చెరుకురసం, నిమ్మరసం నీరు తాగితే ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఎక్కువగా పానీయాలు తీసుకోవాల్సి ఉంది. – డాక్టర్ మాలతి, హెల్త్ ఆఫీసర్, ఏలూరు

ఆట పాటలతో కూడిన విద్యతో మనోవికాసం


స్థానిక 41వ డివిజన్‌లోని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా వారిలో మనోస్థైర్యాన్ని నింపుతుందని, మనోవికాసం వృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో బుధవారం అంగన్‌వాడీ విద్య, ఆటపాటలతో విద్య అనే నినాదంతో జన్ భగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈదుపల్లి కల్యాణి, నవయుగ స్కూల్ హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ప్రథమం ఈసీసీ డీ.శ్రీనివాస్, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నా

ఏలూరు (టూటౌన్): పశ్చిమగోదావరి జిల్లా చించినాడ పేదలు అక్రమ మట్టి తవ్వకాలపై చేస్తున్న ఆందోళనలపై లాఠీచార్జీ చేసి అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఏలూరులో బుధవారం ధర్నా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నగర అధ్యక్షుడు పీ.కిషోర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న అసైన్డ్ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు తవ్వడం దారుణమన్నారు. వాస్తవానికి గోదావరిని ఆనుకుని ఉన్న భూముల్లో మట్టి తవ్వకాలు నిషేధమని గుర్తుచేశారు. చించినాడలో పోరాడుతున్న పేదలకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ. శ్రీనివాసరావు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బీ. బలరాం, ఇతర ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం తగదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు వీ. సాయిబాబు, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

దెందులూరు: అంగన్‌వాడీ, భవిత సెంటర్లల్లో చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ, పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అన్నారు. బుధవారం పోతునూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గుడ్లతో పాటు పౌష్టికాహారాన్ని వైఎస్సార్ సీపీ నేత బత్రాజు సత్యనారాయణతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్త నియామకంలో లోపాన్ని సరిచేయండి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): చింతలపూడి అంగన్‌వాడీ సెక్టార్‌లోని ఎర్రగుంటపల్లిలో ఖాళీగా ఉన్న వర్క్ పోస్టు నియామకంలో జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎర్రగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీ అయిన వర్క్ పోస్టు ఎస్సీలకు సంబంధించిందని, అక్కడ పనిచేసే ఆయాకు అర్హత ఉన్నా... ఆమెను కాకుండా అక్రమ పద్ధతిలో అధికారులు వ్యవహరించారన్నారు. ఎటువంటి జీవో లేకుండా పతంగులగూడెంకు చెందిన మినీ అంగన్‌వాడీ వర్కర్ లక్ష్మిని నియమించారన్నారు. దీనిపై ఐసీడీఎస్ పీడీ పద్మావతిని గత 20 రోజులుగా ఏఐటీయూ ఆధ్వర్యంలో పలు దఫాలు కలిసి వినతులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి స్థానికంగా పనిచేసే ఆయాకే ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ చింతలపూడి నాయకులు గంధం అంజమ్మ, పులపర్తి విజయలక్ష్మి, పరిటాల మల్లేశ్వరి, శ్రీకాకోలు భాగ్యలక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు ,డేగా ప్రభాకర్, పుప్పాల కన్నబాబు, యు. హేమశంకర్, తొర్లపాటి బాబు, రెడ్డి శ్రీనివాసడాంగే పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇంజనీరింగ్‌తో పాటు ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఇటీవల నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

కంప్యూటర్ రంగంలో పరిశోధన చేస్తా..


మానేపల్లి రేవంత్, ఇంజనీరింగ్ 342వ ర్యాంకర్..

కంప్యూటర్ రంగంలో పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలనే ఆసక్తి ఉంది. ఇప్పటికే ప్రపంచంలో భారతదేశం సాంకేతిక రంగాన్ని శాసిస్తోంది. ఆ రంగంలో మరింత అభివృద్ధి చెందాలి. తెలంగాణ ఎంసెట్‌లో 180వ ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్స్‌లో 1200 ర్యాంకు సాధించాను. జేఈఈ అడ్వాన్స్ లో కూడా మంచి ర్యాంకు లభిస్తుందనే భావిస్తున్నాను. చెన్నై, ముంబై, ఢిల్లీ ఐఐటీల్లో ఏదో ఒకదానిలో సీటు లభిస్తుందనే నమ్మకం ఉంది.

ముంబై ఐఐటీలో చేరాలి..


రావూరి సుమ చరిష్మ, ఇంజనీరింగ్ 362 ర్యాకర్..

ముంబై ఐఐటీలో చేరి కంప్యూటర్ కోర్సు చేయాలనేది నా లక్ష్యం. దేశాన్ని సాంకేతికంగా మరింత ముందుకు తీసుకువెళ్లడానికి నావంతు కృషి చేస్తాను. జేఈఈ మెయిన్స్‌లో 165వ ర్యాంక్ సాధించాను. అలాగే తెలంగాణ ఎంసెట్‌లో 496వ ర్యాంకు వచ్చింది. ఇంటర్మీడియట్‌లో 981 మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు సాధించగలిగాను.

యాసిడ్ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): యాసిడ్‌దాడికి పాల్పడిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని బాధితురాలైన ఏ.ప్రాన్సికకు మెరుగైన వైద్యం అందించి ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని ఐద్వా ఏలూరు జిల్లా కన్వీనర్ పీ. హైమావతి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తూ విధుల నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా స్థానిక గ్జేవియర్ నగర్ ప్రాంతంలో ఆమెపై ఆకస్మాత్తుగా యాసిడ్ దాడి చేయడం బాధాకరమన్నారు. యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రాన్సిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	50	ములక్కాడలు	10-15
బెండకాయలు	34	కంద	40
పచ్చిమిర్చి	60-70	బీట్‌రూట్	36
కాకర కాయలు	40	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	35
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	16	బజాజీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	15	దిలకదదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

ఆదర్శనాయకుడు చేగువేరా


చేగువేరా 95వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): తరతరాలు గుర్తుంచుకునే గొప్ప ఆదర్శనాయకుడు చేగువేరా అని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు వీ.సురేష్ అన్నారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో చేగువేరా 95వ జయంతి సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా చేగువేరా చిత్రపటానికి ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పీ.పరమేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నర్సింహరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేగువేరా జీవిత విశేషాల ఆడియోను వినిపించారు. ఈ సందర్భంగా సురేష్‌మాట్లాడుతూ చేగువేరా జీవిత విశేషాలు గురించి వివరించారు. గుడిపాటి నర్సింహరావు మాట్లాడుతూ చేగువేరా డాక్టర్‌గానే కాకుండా చెస్ నేర్చుకుని గ్రాండ్ మాస్టర్ స్థాయికి ఎదిగారన్నారు. విప్లవకారునిగా జీవితాన్ని కొనసాగించారని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్ తరపున ఏవీఆర్ విజ్ఞాన కేంద్రానికి బ్లాక్ అండ్ వైట్ బోర్డును వీ.సురేష్ అందించారు. డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య , పీ. పరమేశ్వరరావులు సాహిత్య పుస్తకాలను బుక్‌బ్యాంకుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాస్, ఎం. లక్ష్మి, సీహెచ్ జగదీష్, దుర్గా ప్రసాద్, రామ్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఏలూరు టౌన్: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్డు వైపు గత రెండు రోజులుగా మద్యం సేవిస్తూ అక్కడే ఉంటున్నాడు. అతను హిందీలో మాట్లాడుతాడని, మద్యం తాగుతూ ఉంటున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈనెల 13న సాయంత్రం అధికంగా మద్యం తాగి గూడ్స్‌షెడ్డువైపు రోడ్డు పక్కన పడుకుని ఉన్నాడని చెబుతున్నారు. బుధవారం ఉదయం చూడగా అతను మృతి చెంది ఉండడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

విద్యార్థులకు యోగ శిక్షణ

పెదవేగి : శరీరాన్ని, మనస్సును ఏకం చేయడమే యోగ ప్రాముఖ్యత అని కొప్పాక యోగా డిస్పెన్సరీ వైద్యాధికారిణి దుర్గాభవాని అన్నారు. పెదవేగి మండలం కొప్పాక ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యోగ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వృక్షాసనం, తాడాసనం, అర్ధచక్రాసనం, వజ్రాసనం, ప్రాణాయామాలు, సూర్యనమస్కారాలను స్థానిక పీడీ శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ కె వినోద్‌కుమార్ చేయించారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గణపవరం: ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణకు ఓఆర్‌ఎస్, జింక్ ట్యాబ్లెట్లు ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో డయేరియా నివారణ పక్షోత్సవాల సందర్భంగా ఐదేళ్లలోపు పిల్లల తల్లులకు అతిసారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.